క్లుప్తంగా

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చాపగానీతండా గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామక అనిల్, రఘుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ఖండించారు. సోమవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇకనైనా ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోకపోతే గ్రామాల్లో అడుగు పెట్టనివ్వమని, అడుగడుగున అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో చేర్యాల మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మద్దూరు మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు లింగం, సందుల సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ



హుస్నాబాద్: విద్యార్థులకు క్రీడాసామగ్రి అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు శ్రేయోభిలాషి ఫౌండేషన్ నిర్వాహకులు క్రీడా సామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం ఆట వస్తువులను అందించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారి మనీల, కౌన్సిలర్ శ్రీనివాస్, శ్రేయోభిలాషి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విష్ణు జగతి, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మిల్కూరి కన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు రూ.4కోట్ల నిధులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.4కోట్ల 50లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడుతూ.. మండల కేంద్రంలో సుమారు కిలోమీటరు మేర సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదన వచ్చిందన్నారు. నిధులు మంజూరుపై సర్పంచ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్

కోహెడరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన కోమిరే రాజశేఖర్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, శంకర్ ఉన్నారు.

నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మానకొండూర్ కోఆర్డినేటర్‌గా గుండారం గ్రామానికి చెందిన మెట్ల నాగరాజును నియమిస్తున్నట్లు కేకేసీ చైర్మన్ లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సోషల్ మీడియాతో ఎండగడతామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక: దౌల్తాబాద్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లు, 7–10వ తరగతుల్లో ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www.telanganams.cgg.gov.in లో ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

కంటి వెలుగు శిబిరాలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



చేర్యాల(సిద్దిపేట): ఆకునూరులో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీఓ దేవకీదేవి

చేర్యాల(సిద్దిపేట): అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట సర్పంచ్ చీపురు రేఖ, ఎంపీఈఓ మహబూబ్ అలీ, వైద్యులు తదితరులున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. సోమవారం మద్దూరు, లద్నూరు గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కంటి వెలుగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని మహిళల శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాంగోపాల్‌రెడ్డి సందర్శించారు. అనంతరం గ్రామంలోని వైకుంఠధామంలో మురికి చేరి అస్తవ్యస్తంగా మారడంతో గ్రామస్తులు డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. మురుగు లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ పరిష్కారం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఖాజామొయునుద్దిన్, ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, మాధవ్ జాదవ్, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. శిబిరంలో ఉచిత పరీక్షలతో పాటు కంటి అద్దాలు ఇస్తున్నారని తెలిపారు. ప్రతీ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని రజిత కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ అధికారి సరోజ అన్నారు. సోమవారం దౌల్తాబాద్, రాయపోల్ మండలలో కంటి వెలుగు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి పరీక్షలు ఎలా జరుగుతున్నాయని అధికారులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్, రాయపోల్ ఎంపీడీఓలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంతాయిగూడ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరూ పరీక్షలు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వందశాతం కంటి పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



దుబ్బాక: ఇందుప్రియాల్ శిబిరంలో వివరాలు తెలుసుకుంటున్న బీసీ సంక్షేమ అధికారి సరోజ



జగదేవ్‌పూర్(గజ్వేల్): అంతాయిగూడ శిబిరంలో మహిళకు అద్దాలు అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

కంటి వెలుగుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ హెచ్చరించారు. మిరుదొడ్డి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డా.కాశీనాథ్‌తో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. కంటి వెలుగు శిబిరానికి వస్తున్న స్పందన బాగున్నా, ఎలాంటి వెలుతురు లేకుండా ఇరుకు గదుల్లో విధుల నిర్వహణపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కంటి వెలుగు శిబిరానికి వచ్చిన వారికి కనీస వసతులు కల్పించకపోవడంపై ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటి వెలుగులో అందిస్తున్న వైద్య విధానంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగును ప్రజలు మరింత సద్వినియోగం చేసుకోవడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు మరింత ప్రచారం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకను కోరారు. నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, ఎంపీడీఓ రాజిరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి, సర్పంచ్‌లు రంగనబోయిన రాములు, జోగ్యారి బాల్‌నర్సింహులు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఆకారంలో వరిపైరును పరిశీలిస్తున్న అధికారి ప్రవీణ్‌కుమార్

దుబ్బాక: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా, చలి తీవ్రత అధికంగా ఉండడంతో వరి పైరుకు కాండం తొలుచు పురుగు లేదా మొగి పురుగు ఆశించి నష్టం కలిగిస్తుందని దుబ్బాక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం దుబ్బాకతో పాటు మండల పరిధిలోని ఆకారం గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొగి పురుగు కారణంగా పైరు ఎర్రగా మారి రైతులకు నష్టం కలిగిస్తుందన్నారు. వరినాట్లు వేసిన రైతులు 15 రోజుల్లో నుంచి 30 రోజుల వరకు ఈ పురుగు గమనించినట్లయితే క్లోరాంట్రానిలిప్రోల్ 4జీ గుళికలు ఎకరానికి 4 కిలోల చొప్పున లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కిలోల చొప్పున చల్లాలని సూచించారు. వరిపైరు అంకురం దశ నుంచి పొట్ట దశలో ఈ పురుగు కనిపిస్తే క్లోరాంట్రానిప్రోల్ 18.5 ఎస్‌పీ మందును ఎకరానికి 60 ఎంఎల్ వాడాలని కోరారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

హుస్నాబాద్: పట్టణంలోని వరి పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు పరిశీలించారు. కాండం తొలుచు పురుగు, మోగి పురుగు, ఆకు చుట్టూ పురుగు ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పురుగు నివారణకు రైతులు ముదిరిన నారు వేసినప్పుడు వాటి కొనలు తుంచి వేయాలన్నారు. పొలాల్లో అధికంగా నీరు నిల్వ ఉన్నట్లయితే వాతావరణ పరిస్థితులకు వరి ఎర్రబడుతుందన్నారు. మోతాదుకు మించి యూరియా వాడకూడదన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



విజేతలకు షీల్డ్ బహూకరిస్తున్న ప్రజాప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందం అన్నారు. మండల పరిధిలోని రామునిపట్లలో గ్రామానికి చెందిన ఆకుల లచ్చవ్వ, నర్సయ్యల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా స్నేహభావం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవర్చుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మంద పాండు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు, టై, బెల్ట్, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్‌స్యూఐ జిల్లా నాయకులు అజ్జు యాదవ్, ఎస్‌ఎంసీ చైర్మన్ యాదయ్య, నాయకులు శ్రీనివాస్, మల్లేశం, కనకరాజు, శ్రీకాంత్, మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): క్రీడాకారుల ప్రోత్సహించడానికి తమవంతుగా సహాయం అందిస్తామని దాత నర్ర రాఘవారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో క్రీడాకారులకు షూలు, డ్రెస్సులను అందజేశారు.

గజ్వేల్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, తదితరులు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 18వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. గజ్వేల్ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడం ఈ ప్రాంతానికి వరంగా మారిందని చెప్పారు. పట్టణాన్ని మురుగు రహితంగా తీర్చిదిద్దేందుకు రూ.100కోట్లతో చేపట్టిన యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు పూర్తికావొస్తున్నాయని తెలిపారు. గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లను బాగు చేసే క్రమంలో అన్ని వార్డుల్లో సీసీరోడ్లను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మెట్టయ్య, రజిత, నాయకులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌రూరల్: అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో ప్రభుత్వం ఆత్మస్థైర్యం నింపుతూ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కొల్గూరు ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన నీరుడి ప్రవీణ్ అనారోగ్యానికి గురికాగా వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 2లక్షల విలువైన చెక్కును సోమవారం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



వాసవీమాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

హుస్నాబాద్: ఆర్యవైశ్య భవన్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, అమ్మవారికి 108 కలశాలతో అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, హోమం, వాసవి పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు నార్ల విజయలక్ష్మి, వాసవి క్లబ్ అధ్యక్షుడు తాటిపెల్లి వీరేశం, వాసవి, వనిత క్లబ్ అధ్యక్షురాలు రాగి కవిత, యువజన విభాగం అధ్యక్షుడు సందీప్, మహిళలు పాల్గొన్నారు.



వెండిచీరలో ప్రత్యేకంగా అమ్మవారి అలంకరణ

అమ్మవారికి వెండి చీర

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి 8.5కిలోల వెండి చీరను భక్తులు సమర్పించి, ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీమాతకు సిద్దిపేట ఆర్యవైశ్య భవన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, పుష్పార్చన, అన్నప్రసాద వితరణ తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

నేతాజీ సేవలు మరువలేనివి



మర్కూక్(గజ్వేల్): గణేష్‌పల్లిలో నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

మర్కూక్(గజ్వేల్): నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో నడవాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా గణేష్‌పల్లి గ్రామంలో బోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ సేవలను కొనియడారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల శ్రీరాములు, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్, లక్ష్మీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజు, మహేష్, బాల్‌రెడ్డిపాల్గొన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హుస్సేన్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మూల రంజిత్‌రెడ్డి, కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు నివాళులర్పించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర సంఘటనా మంత్రి లక్ష్మీపతి, అంబేడ్కర్ జోనల్ ఇన్‌చార్జి సంతోష్, సంజయ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఏఐఎస్‌బీ మండల అధ్యక్షుడు ఆత్మకూరి హరికృష్ణ, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణుతో కలిసి నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో కనకయ్య, ప్రవీణ్, శివకుమార్, చరణ్, శివతేజ, రమేష్, మనోహర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

హుస్నాబాద్: జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించినా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వారిలో ఏఐఎఫ్‌బీ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వారిలో యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిన నర్సింలు, ప్రతినిధులు శ్రీను, మంతూరి నాగరాజుగౌడ్, వినోద్, శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, నర్సింలు, సందీప్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు కోడిగుడ్డుపై నేతాజీ రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. జననం ఉండి మరణం లేని వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.



సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో..



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు



గజ్వేల్‌లో..

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధ్యాయుల నిరసన**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్టీటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండలంలోని అన్ని పాఠశాలల ఎదుట నల్లా బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లాలు మారిన ఉపాధ్యాయులకు బదిలీలలో అవకాశం ఇవ్వాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **మహాసభను విజయవంతం చేయాలి**

సిద్దిపేటకమాన్: అనాథ పిల్లల హక్కుల సాధనకు ఈనెల 30వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాసభ నిర్వహిస్తామని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనాథల పిల్లలపై చేసిన హామీలను నెరవేర్చాలన్నారు.

◆ **చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి**

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్ పాము నాగేశ్వరిశ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల్లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేఖర్, సంపత్, హెచ్‌ఎం సరళ తదితరులు ఉన్నారు.

◆ **నిందితులను శిక్షించాలి**

సిద్దిపేటకమాన్: కోటగిరి టీచర్ మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని స్వేచ్ఛ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం స్వేచ్ఛ జేఏసీ నేతలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిపై జరిగిన దాడిలో పాల్గొన్న వారిలో వీడియోల ఆధారంగా సుమోటగా తీసుకొని వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, డీబీఎఫ్, ఐద్వా, కేవీపీఎస్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మధు, స్వామి, వేణు, కిషన్, సంతోష్, సంజీవ్, ప్రణయ్, ప్రకాంత్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

◆ **విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శిగా నరేశ్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శిగా, సిద్దిపేట జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బుస్సా నరేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆదివారం రాత్రి విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సమావేశాలు హైదరాబాద్‌లోని విజయశ్రీ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహా కార్యదర్శిగా బుస్సా నరేశ్‌కు నూతన బాధ్యత అప్పగించారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాషా పండితులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ హైకోర్ట్ తుది తీర్పునకు లోబడి వెంటనే పండితులకు పదోన్నతులు కల్పించాలని, న్యాయ శాఖ ద్వారా భాషా పండితుల పదోన్నతుల సాధ్య అసాధ్యాలను పరిశీలించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని, భాష పండితుల జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు భాషా పండితుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ పరిపాలనాధికారికి, జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రకటించిన విధంగా భాషా పండితుల పదోన్నతుల కోసం చర్యలు ప్రారంభించిహామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పండిత జేఏసీ బాధ్యులు బి.శశికుమార్, ఎం.డీ.అబ్దుల్ రవూఫ్, బి.రాజయ్య, ప్రవీణ్‌కుమార్, శివరాజం, రమేష్, సయ్యద్, మహేందర్‌రెడ్డి, సత్యం, లతీఫ్, రాజమౌళి, నసీరుద్దీన్, శంకర్, లింగం, నరేశ్, రమేష్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, అమరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.